కె.వరలక్ష్మి

# నమ్మకం

**అందరూ అదేమాట. అరవిందకి మతిపోయినట్లైంది.**

* * *

ఆరేళ్ల క్రితం ఆనందమూర్తిని పెళ్లాడి అరవింద మెట్టినింట అడుగుపెట్టింది. పల్లె పట్నం కాని ఊళ్లో ఎనిమిది వందలు సంపాదించే చిరుద్యోగంతో బాటె ఆనందమూర్తికి సొంతానికి ఓ పూరిల్లు కూడా వుంది. ఆనందమూర్తికి అతని తండ్రి, అతని కోసం మిగిల్చిన ఏకైక ఆస్తి అది.

పసుపుబట్టల్తో అతని వెంట ఆ ఇంట్లో అడుగుపెట్టిన అరవింద గది మధ్యలో ఆధారంగా నిలబెట్టిన పుచ్చిపోయిన నిట్రాటనూ, చౌడు రాల్తున్న మట్టి గోడల్ని చూసి గతుక్కుమంది. వెంటనే ధైర్యం తెచ్చుకుంది. మర్నాటి నుంచే కొంగు బిగించి పనిలో దూకింది.

గోడలు చదునయ్యేలా మెత్తింది. నేల అలికి ముగ్గులు పెట్టింది. ఇంటిముందున్న చాపంత వాకిలిని ఊడ్చి, గోతులు పూడ్చి చదును చేసింది. వాకిలి అంచున నిరంతర జీవవాహినిలా ప్రవహిస్తున్న మురికి కాలవని ఏమీ చెయ్యలేక దిగాలు పడింది. కాలవని శుభ్రం చెయ్యబోయి దానిలోంచి ఝుమ్మని లేచిన దోమల ధాటికి తాళలేక విరమించుకుంది. కాలవ మీంచి లాంగ్‌జంప్ చేసిన భర్తను గుర్తుకు తెచ్చుకుని చూరు పక్కనున్న పాత బల్లచెక్కొకటి వాకిలి అంచునించి రోడ్డు మీదికి వాల్చింది.

ఆ సందర్భంలో గుమ్మానికెదురుగా వాకిలి అంచున పేరుతెలీని రెండు జానల మొక్కొకటి కనిపించింది. ఏదో పిచ్చిమొక్కలే అని తుంచి పడేయబోతే ఎంత గట్టిగా నేలలో వేళ్లూనుకుని వుందో, ఆకులు మాత్రం తెగి చేతిలో కొచ్చాయి. తర్వాత తవ్వి పడేయొచ్చులే అనుకొని దాని మాటే మరిచిపోయింది, రెండు వారాల తర్వాత చూస్తే ఆ మొక్క తుంచినచోటునుంచి రెండుశాఖల్తో చిగురించి కన్పించింది. 'పోనీలే, అదేం చేసింది' అని వదిలేసింది.

ఏడాదినాటికే అది జయ్యిజయ్యిమని ఎదిగిపోయింది.

అరవింద మొదటి కాన్పుకి పుట్టింటికెళ్లింది. పాపాయి నెత్తుకొని వచ్చేసరికి ఏపుగా ఎదిగి వాకిలినిండా ఆకులు రాల్చేసి కొత్తచిగుళ్లు వేస్తూన్న చెట్టునుచూసి, చికాకుపడింది పారబోయా లనుకున్నప్పుడు తెల్సింది ఆకులు పెళుసుగా ఉన్నాయని. చాన్నాళ్లు పాపాయి స్నానానికి నీళ్లు కాచడానికి ఉపయోగపడ్డాయని. చిగుళ్ల వెంట లేతపచ్చని పూత, ఆపైన గుత్తులు గుత్తులుగా ద్రాక్షకాయల్లా కాసిన కాపు చూశాక గానీ అది కుంకుడు చెట్టని అర్థం కాలేదు అరవిందకి.

"ఏవండీ, ఇది కుంకుడుచెట్టు" అంది సంభ్రమంగా ఆనందమూర్తితో.

"మరేం చెట్టనుకున్నావ్?" అని కాజువల్‌గా తిరిగి ప్రశ్నించి తన పనిమీద వెళ్లిపోయాడు ఆనందమూర్తి.

అరవిందకి పాపాయి పుట్టిన ఆనందం పాతబడింది, తన వాకిట్లో తన కళ్లెదుట పెరిగిన చెట్టు దగ్గరదగ్గర అరబస్తా కాయలు కాయడం, అవి ఏడాదిపాటు ముగ్గురికీ తలంటుకోడానికి ఉపయోగపడగా ఇంకా మిగిలిపోవడం, అంతా సంభ్రమంగా వుంది.

రెండో కాపులో చెట్టు నిలదొక్కుకుని మరిన్ని కాయలు కాసింది. బస్తాతో బస్తాడు పైనే కాయలైనై. కుంచం నలభై లెక్కన కొనుక్కెళ్లడానికి వచ్చిన వ్యాపారి ఒకాయన "కుంకుడుచెట్టు ఏటికేడూ కాపు పెరుగుతుందమ్మా. కాయ మంచి ఒకటో రకం. ఎవరికీ ఇచ్చెయ్యకండి. ఎంత రేటుంటే అంతకీ నేనే కొనుక్కెళ్తుంటాను." అన్నాడు.

వ్యాపారి తన చేతిలో పెట్టిన వెయ్యి రూపాయల్ని నమ్మలేనట్టు చూసింది అరవింద.



చాలీచాలని జీతంతో ఇబ్బంది పడకుండా ఆ దేవుడే ఈ చెట్టుని వాకిట్లో ప్రసాదించాడు అని నమ్మింది. డబ్బు పట్టుకెళ్లి గూట్లో దేవుడి ముందుంచి భక్తిపూర్వకంగా నమస్కరించింది.

రెండో కాన్పుకి పుట్టింటి వాళ్లు పిలిచినా కుంకుడుకాపు రోజులని వెళ్లడం మానేసింది. అలాంటి చెట్టునిప్పుడు నరికిపడెయ్యమని

ఇంటికొచ్చిన ప్రతి వొక్కరూ సలహాలిస్తూంటే అరవిందకి చేదుమింగినట్లుంటోంది. ఆనందమూర్తి అనారోగ్యం మరో పక్క గుండెను పిండి చేస్తోంది.

ఏడాది క్రితం ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగి నెల్లాళ్లు ఆస్పత్రిలో వున్నాడు ఆనందమూర్తి. ఆ



తర్వాత ఇంటికొచ్చినా పూర్తిగా కోలుకోలేదు. మనిషి క్రమంగా నీరసించిపోయాడు. ఫ్యాక్టరీకి పదిరోజులెళ్లీ, పదిరోజులెళ్లకా ఆర్నెల్లపాటు నెట్టుకొచ్చాడు. ఈ మధ్య మరీ లేవలేని తీర్సైపోయాడు.

అందుబాటులో వున్న డాక్టర్లందరికీ చూపించి మందులు వాడింది అరవింద. ఫలితం లేకపోయింది. ఐదు నక్షత్రాల ఆస్పత్రుల్లో చూపించండని కొందరు సలహా ఇచ్చారు. అంత స్తోమతెక్కడిది?

ప్రమాదం జరిగినప్పుడు ఫాక్టరీ వాళ్లిచ్చిన పదివేలూ ఏనాడో ఖర్చైపోయాయి. అట్నుంచీ ఇట్నుంచీ ఆదుకోగల బంధువర్గం ఎవరూ లేరు.

ఆనందమూర్తిని చూసిపోవడానికొచ్చే దూరపు బంధువులూ. స్నేహితులూ ఒకటే పాట మొదలుపెట్టారు. "వాకిట్లో కుంకుడు చెట్టుండకూడదు. అరిష్టం. అందుకే ఇలా జరిగి ఉంటుంది" అని.

మొదట్లో ఆ సలహా ఇచ్చేవాళ్లందరికీ "తనదీ, తన పిల్లల్దీ కర్మమిలా కాలిందిగానీ పచ్చని చెట్టేం చేసిందీ; అలా అయితే ఎన్నెన్ని యాక్సిడెంట్లు జరగడం లేదు? ఎందరికి అనారోగ్యాలు ముంచుకు రావడం లేదూ? వాళ్లందరి ఇళ్లముందు కుంకుడుచెట్లున్నాయా?"

అని సమాధానమిచ్చేది అరవింద.

వినగా వినగా మేకపిల్ల కుక్కపిల్లైన చందమౌతోంది.

ఆనందమూర్తి పరిస్థితి క్రమంగా విషమిస్తోంది. కొత్తగా చిగుళ్లు తొడిగి అప్పుడే పూతకొస్తూన్న కుంకుడు చెట్టును నరికించాలంటే గుండె కరిగి నీరవుతోంది. చేసేదేం లేక తన గుండెను రాయి చేసుకుంది అరవింద. పక్కింటి పరమయ్యను పిలిచి కట్టెలు అతనే తీసుకునే ఒప్పందంమీద చెట్టును నరికించేసింది. ఎండవేళ నీడనిచ్చింది. వాకిలికి అందాన్నిచ్చింది. అన్నిటినీ మించి ఆర్థికంగా ఆదుకుంది. అలాంటి పచ్చని చెట్టు నేలకూలడం చూడలేక కళ్లు మూసుకుని కూర్చుండిపోయింది. మూసిన కనురెప్పల్లోంచి కుంకుడు గింజలంతేసి కన్నీళ్లు ఆమె ఒడిలోని బిడ్డ తలని అభిషేకించాయి.

మార్నాడు బోసిపోయిన వాకిలిని చూసి, అరవింద హృదయం బావురుమంది. కుంకుడు చెట్టు వేళ్లను కూడా మిగల్చలేదు పరమయ్య.

నెమ్మదిగా తనకు తనే నచ్చజెప్పుకుంది. చెట్టంత భర్త కోసమే కదా తనీ పాపానికి ఒడిగట్టింది. ఆయన మంచంలోంచి లేచి తిరిగితే అంతే చాలు!

మరో పదిరోజుల తర్వాత పడుకున్నవాడు పడుకున్నట్టే నిద్రలో ప్రాణాలు వదిలాడు ఆనందమూర్తి.

■